క్లుప్తంగా

పింఛన్ నగదు రూ.5.64 కోట్లు విడుదల

పెనమలూరు: వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5.64 కోట్లు విడుదల చేసిందని మండల పరిపాలనాధికారి లోయ శివశంకర్‌రావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ.. పెనమలూరు మండలంలో 5,835 మంది లబ్ధిదారులకు రూ.1.74 కోట్లు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో 12,969 మంది లబ్ధిదారులకు రూ.3.90 కోట్లు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఆయా గ్రామాల్లో గురువారం నుంచి లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదు అందిస్తారన్నారు.

కులగణన సర్వే పరిశీలన

పెనమలూరు: కానూరులో జరుగుతున్న కులగణన సర్వేను తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. ఆయన కానూరు సచివాలయం నాలుగు పరిధిలో మణికంఠ నగర్ పరిధిలో పర్యటించి సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కులగణనకు వివరాలు తెలపాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి కులగణన చేస్తారన్నారు. కులగణన సమయంలో స్థానిక ప్రజలకు సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ



పెనమలూరు: పెనమలూరు ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలకు బుధవారం మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాస్ యూనిఫాం పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 127 మంది ఆశ కార్యకర్తలకు ఒక్కొక్కరికి రెండు చీరలు చొప్పున ఏకరూప దుస్తులను అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు వారి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ఆశ కార్యకర్తలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజా, మంజుల, లలిత, ఆశ కార్యకర్తల నోడల్ అధికారి ఏవీవీ లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, సీహెచ్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బాల ఏసు మహోత్సవాలు ప్రారంభం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక గుడివాడరోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో అద్భుత బాల ఏసు మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ మేత్రాసనం గురువులు పిల్లి అంబేడ్కర్, కిరణ్, ఆర్.విజయ్, ఎం.బాలస్వామి, పి.ప్రతాప్, జ్యోతినగర్ విచారణకర్త ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి దివ్య బలిపూజ సమర్పించారు. ఏసుకు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. జేఎంజే సిస్టర్స్ బాల ఏసు గీతాలను ఆలపించారు. అనంతరం బాల ఏసు ఉపదేశాన్ని భక్తులకు ప్రబోధించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరై విశేష పూజలు నిర్వహించారు.

మురుగు సమస్యపై అధికారుల విచారణ



కంకిపాడు: శ్రీచైతన్య విద్యాసంస్థల నుంచి వెలువడుతున్న మురుగుతో పడుతున్న ఇబ్బందులపై అధికారుల బృందం బుధవారం విచారణ జరిపింది. ఇటీవల పునాదిపాడు గ్రామానికి పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుకు స్థానికులు చైతన్య విద్యాసంస్థల నుంచి వస్తున్న మురుగుతో ప్రజారోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేయటంతో డీపీఓ నాగేశ్వర నాయక్, ఆర్డీఓ రాజు నేతృత్వంలోని బృందం గ్రామంలో పర్యటించింది. విద్యాసంస్థల నుంచి వస్తున్న మురుగు, పంట కాలువల కలుషితం, ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించి ఆయా సమస్యలపై విచారణ జరిపారు. విద్యాసంస్థల నుంచి మురుగు బయటకు నేరుగా రాకుండా ప్రాంగణంలో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని విద్యాసంస్థల ప్రతినిధులకు సూచించారు. లేనిపక్షంలో ప్యూరిపై చేసిన మురుగును ప్రత్యేక పైపులైన్ల ద్వారా మురుగు కోడులో కలుపుకోవాలని ఆదేశించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. వారంలోగా సమస్య పరిష్కారం చేయాలని సూచించారు. సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు. విచారణలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అనూష, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

గన్నవరం: ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాలకు చెందిన పురుషులు, మహిళల జట్లు హాజరయ్యారు. తొలుత ఈ పోటీలను పురస్కరించుకుని క్రీడా పతాకాన్ని ఎంపీపీ అనగాని రవి ఆవిష్కరించారు. క్రీడా జ్యోతిని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కె.ఝాన్సీలక్ష్మి వెలిగించారు. అనంతరం కబడ్డీ కోర్టును ఎంపీపీతో పాటు డీఎస్‌డీఓ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, సర్పంచ్ నిడమర్తి సౌజన్య ప్రారంభించారు. తొలుత మహిళల విభాగంలో గన్నవరం, పామర్రు నియోజకవర్గ జట్ల మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలకు హాజరైన క్రీడాకారులు, అధికారులు, సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేశారు. ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని బాబీ, ఎంపీడీఓ ఈ. సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడివాడ, పామర్రు విజేతలు

ఆడుదాం ఆంధ్ర కృష్ణాజిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలుగా పురుషుల విభాగంలో గుడివాడ నియోజకవర్గ జట్టు, మహిళల విభాగంలో పామర్రు నియోజకవర్గ జట్టు నిలిచాయి. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. పురుషుల ఫైనల్ మ్యాచ్‌లో పెనమలూరు జట్టుపై గుడివాడ జట్టు 18–25 పాయింట్ల తేడాతో గెలుపొందింది. మూడో స్థానంలో పామర్రు జట్టు నిలిచింది. మహిళల విభాగంలో గుడివాడ జట్టుపై పామర్రు జట్టు 19–57 పాయింట్లతో ఘనవిజయం సాధించగా, మూడో స్థానంలో మచిలీపట్నం జట్టు నిలిచింది. పురుషులు, మహిళల విభాగంలో విజేతలుగా నిలిచిన గుడివాడ, పామర్రు జట్లు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నాయి. అనంతరం వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, డీఎస్‌డీఓ కె.ఝాన్సీలక్ష్మి చేతుల మీదుగా షీల్డ్స్, మెడల్స్, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. పురుషులు, మహిళల విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులను వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయనున్నట్లు డీఎస్‌డీఓ తెలిపారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బంది, పీఈటీలను ఎంపీపీ అనగాని రవి అభినందించారు. పట్టణ ప్రముఖులు మెర్ల చంద్రశేఖర్ జయంతి సందర్భంగా జిల్లా పోటీలకు విచ్చేసిన క్రీడాకారులు, ప్రతినిధులకు చంద్రశేఖర్ కుమారుడు వంశీ భోజన సదుపాయం కల్పించారు.



పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన గుడివాడ జట్టు



మహిళల విభాగం విజేత పామర్రు జట్టు



క్రీడా జ్యోతిని వెలిగించిన ఎంపీపీ రవి, డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మి, అధికారులు

పీఆర్ కోడ్‌తో ఇంటి పన్ను వసూలు

విజయవాడరూరల్: ఇంటి పన్ను వసూలు ఇక నుంచి పీఆర్ కోడ్‌తో వసూలు చేస్తామని విజయవాడ పంచాయతీ డివిజనల్ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా మాట్లాడారు. గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు చేసే సిబ్బంది డబ్బులు వసూలు చేసి కొన్ని రోజుల అయిన పిమ్మట ప్రభుత్వ ఖాతాలో జమ చేయడం జరిగేదని, దాని వలన ప్రజలు చెల్లించిన డబ్బు నేరుగా ప్రభుత్వ ఖాతాకు జమ కావడానికి కొంత జాప్యం అవుతుందన్నారు. ప్రభుత్వం ఐడీబీఐ బ్యాంక్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రజలు నేరుగా ఇంటి పన్నుకు సంబంధించి చెల్లించే నగదును పీఆర్ కోడ్‌తో నేరుగా ఫోన్ పే, ఆన్‌లైన్‌లో చెల్లించే సదుపాయాన్ని అమలు చేస్తున్నట్లు డీఎల్‌పీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ విధానం వలన ప్రభుత్వానికి నేరుగా ప్రజలే పీఆర్ కోడ్‌తో నగదు చెల్లించే వీలుందన్నారు. ఇప్పటికి ఎన్టీఆర్ జిల్లాలో 30 శాతం ఇంటి పన్ను వసూలు పీఆర్ కోడ్‌తో చెల్లింపులు చేశారని ఆయన తెలిపారు. ఈ విధానంతో నిధులు దుర్వినియోగం కావడానికి ఆస్కారం ఉండదన్నారు. ఇంటి పన్ను చెల్లించేందుకు వచ్చే ప్రజలు పీఆర్ కోడ్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకోవాలని సూచించారు.

వీధి బాలలను సంరక్షించడం బాధ్యతగా గుర్తించాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జయలక్ష్మి, వేదికపై జడ్జి శ్రీనివాసబాబు, అధికారులు

గన్నవరం: వీధి బాలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి కె.జయలక్ష్మి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో బుధవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ.. ప్రస్తుత గణంకాలు ప్రకారం దేశంలో 1.80 కోట్ల వీధి బాలలు ఉన్నారని చెప్పారు. వీరి సంరక్షణకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నప్పటికి ఇంకా వీధి బాలలు సంచారిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులపై అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయే పిల్లల పరిస్థితి దుర్భారంగా ఉంటుందన్నారు. ఇటువంటి బాలలపై అక్రమ మానవరవాణాదారుల కన్ను ఉంటుందని చెప్పారు. పిల్లలను విదేశాలకు రవాణా చేయడం వారి అవయవాలతో వ్యాపారం చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతుంటారన్నారు. వారి బారిన పడకుండా వీధి బాలలను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎక్కడైన వీధి బాలలు కనిపిస్తే వెంటనే చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. దీనివల్ల వీధి బాలలు తప్పుడు మార్గాల్లో వెళ్లకుండా కాపాడే అవకాశం ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ సీహెచ్. శ్రీనివాసబాబు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఎంఈఓ కె.రవికుమార్, ఎస్ఐ నాగరాజు, ప్యానల్ అడ్వకేట్ వైఆర్.శారద, ఇన్‌చార్జి హెచ్‌ఎం మోహిని కృష్ణకుమారి, న్యాయసేవా సహాయకులు రామినేని రవిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత



పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్

రామవరప్పాడు: ప్రత్యేక పారిశుధ్య నిర్వహణలో భాగంగా విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో బుధవారం సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పూడికతీత పనులు నిర్వహించారు. ప్రధాన గ్రామంతో పాటు రామానగర్, నెహ్రూనగర్, కాల్వగట్టు ప్రాంతాల్లోని సైడు డ్రెయిన్లలో మురుగు నీరు సజావుగా పారుదల అయ్యే విధంగా పారిశుధ్య సిబ్బందిచే పూడిక తీయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచే నిమిత్తం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లోని చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామన్నారు. జాతీయ రహదారిపై, ఫుట్‌పాత్‌ల వద్ద చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హోటల్స్, దుకాణాల వద్ద చెత్త వేయరాదని గతంలోనే సంబంధిత దుకాణదారులకు నోటీసులు అందజేశామన్నారు. పారిశుధ్యంపై సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

విజ్ఞాన నిలయం పురుషోత్తపట్నం గ్రంథాలయం



పురుషోత్తమపట్నంలో పుస్తకాలను ప్రదర్శిస్తున్న పాఠకులు, గ్రామస్తులు(ఫైల్)

గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం విజ్ఞాన నిలయంగా నిలుస్తోంది. 1950వ దశకంలో ఆ గ్రామ పెద్దలు ఎంతో ముందు చూపుతో స్థానికంగా గ్రంథాలయం అవసరాన్ని గుర్తించి ఎంతో శ్రమకోర్చి గ్రంథాలయం నిర్మించారు. 1954వ సంవత్సరంలో నిర్మాణానికి దాతలు సహకరించి ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో ఆంధ్రా గ్రంథాలయం అనే పేరుతో స్థాపించి గ్రామంలోని విద్యార్థులు, యువత, రైతులు, పెద్దలు, మహిళలు అందరిని పుస్తక పఠనం వైపు నడిపించారు. అప్పటి నుంచి దినదినాభివృద్ధి చెందుతూ అనంతర కాలంలో 1959 నుండి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ అజమాయిషీలో నడుస్తూ ఉంది. డాక్టర్ గోపీచంద్, గణపతి శాస్త్రి, ముళ్లపూడి వెంకట రమణ, డాక్టర్ యోగా శ్రీ, మేకపాటి మురళీ, యండమూరి వంటి ప్రముఖుల పుస్తకాలు పాఠకులకు నిరంతరం అందుబాటులో ఉన్నాయి.

వెయ్యికి పైగా పుస్తకాలు..

అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పుస్తక పఠనం కార్యక్రమాలను ఈ గ్రామంలోని పాఠకులు అమలు చేస్తూ విద్యార్థులను పుస్తక పఠనం వైపు నడిపిస్తున్నారు. బాల సాహిత్యం మొదలుకొని తత్వ శాస్త్రం వరకూ గ్రంథాలను అందుబాటులో ఉంచారు. గ్రంథాలయాలు ఉన్న గ్రామాలు జ్ఞాన సంపదకు నిలయాలుగా విలసిల్లుతాయన్న సత్యాన్ని ఈ గ్రంథాలయం రుజువు చేస్తుంది. ఈనాటికి గ్రంథాలయానికి గ్రామంలోని పాఠకులు, పెద్దలు అండగా నిలవటం విశేషం 1954వ సంవత్సరం నుంచి గ్రామస్తులకు విజ్ఞానాన్ని అందిస్తూ పురుషోత్తపట్నం గ్రంథాలయం ఆదర్శంగా నిలుస్తోంది. వెయ్యికి పైగా పుస్తకాలు ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి.

పలువురు అధికారుల బదిలీ

పెనమలూరు: పెనమలూరు ఎంపీడీఓ సునీతాశర్మ బదిలీ అయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆమెను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆమె బుధవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఆమె పెనమలూరులో బాధ్యతలు నిర్వర్తించారు.

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కె.లక్ష్మి బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆమెను కాకినాడ జిల్లాకు బదిలీ చేసింది.

ఉంగుటూరు: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఉంగుటూరు తహసీల్దార్ డి.వనజాక్షి రాజమండ్రికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో బదిలీ ఉత్తర్వులు బుధవారం ఆమె అందుకున్నారు.

ఏబీసీడీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలి

గన్నవరంరూరల్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చింతగుంట గ్రామంలో బుధవారం జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరిగే బడ్జెట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ఆమోదించాలని కోరారు. ప్రధాని మోదీ వర్గీకరణ చేస్తామని హైదరాబాద్ సభలో మాట ఇచ్చి మరలా కమిటీ వేయటం సరికాదన్నారు. కాలయాపన కాకుండా కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదించటం ద్వారా చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. సభ్యులు వరదయ్య, వీరమ్మ, మరియమ్మ, జానేషు, ప్రశాంత్ ఉన్నారు.

మండల పరిషత్ భవనానికి కొత్త అందాలు

రూ.12 లక్షలతో భవనానికి మరమ్మతులు



మండల పరిషత్ భవనానికి ఏర్పాటు చేసిన గ్రిల్స్

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ భవనం కొత్త అందాలతో కళకళలాడుతోంది. కార్యాలయ భవనం నిర్మించి సుమారు 23 ఏళ్లు గడుస్తున్నా కార్యాలయంలో వసతులు అరకొరగా ఉన్నాయి. అలాంటి వాతావరణంలోనే ప్రతి రెండు నెలలకు ఒక పర్యాయం జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలను నిర్వహించుకోవాల్సిన పరిస్థితి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యాలయంలో సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా అవసరమైన సభావేదిక నిర్మించారు. ఫ్లోరింగ్ లేకపోవడం, కోతులు కార్యాలయంలోపలికి రావడం, మహిళా సిబ్బంది భయానికి గురికావడం లాంటివి సంఘటనలు అనేకం గతంలో జరిగాయి.

మెయిన్ గేటు ఏర్పాటు..

ప్రస్తుతం కోతులు కార్యాలయంలోనికి రాకుండా బైట వైపు చుట్టూ ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. శిథిలమైన భవనంతో శ్లాబ్‌కు సంబంధించిన ఇనుప చువ్వలు బైటకు కనిపించేవి. మాసిపోయిన రంగులతో కళావిహీనంతో కనిపించే మండల పరిషత్ భవనం నేడు కొత్త రంగులతో హంగులతో కళకళలాడుతోంది. విజయవాడ నగరం మధ్యలో ఉన్న మండల పరిషత్ భవనం కింది భాగంలో మండల తహసీల్దార్ కార్యాలయం కూడా ఉండటంతో నిత్యం అధికారులు రాకపోకలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు వివిధ పనులపై రావడం లాంటివి జరుగుతుంటాయి. అలాంటి విజయవాడ రూరల్ మండల కాంప్లెక్స్ భవనం నేడు ప్రభుత్వ కార్యాలయ భవనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. విజయవాడ రూరల్ మండల పరిషత్ సాధరణ నిధులు 12 లక్షల రూపాయలతో టాయిలెట్స్, గోడలు రిపేరుతో పాటు మెయిన్ గేటు ఏర్పాటు లాంటి అభివృద్ధి పనులు చేపట్టారు. ఫిబ్రవరి 2వ తేదీన మండల పరిషత్ సాధరణ సమావేశం నాటికి తుది పనులు కూడా పూర్తి చేసి భవనం పూర్తిస్థాయి ఉపయోగంలోకి రానుందని అధికారులు తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గుణదల(విజయవాడతూర్పు): ఆరోగ్యంపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రముఖ వైద్యురాలు ఎస్.హిమబిందు అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనా సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో విజయపథంలో నడుస్తున్నారని తెలిపారు. దీనితో పాటు స్త్రీలలో మానసిక, శారీరక ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి మహిళ తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించాలని కోరారు. ఆందోళన చెందకుండా తగిన వైద్యం తీసుకోవాలని సూచించారు. అనంతరం మహిళల్లో రొమ్ము క్యాన్సర్ సమస్య తలెత్తినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్, ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ టి.తబిత, విద్యార్థులు పాల్గొన్నారు.

3 నుంచి మహిళా ఉత్సవ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ప్రకటనలో తెలిపారు. మహిళలు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ మహిళా ఉత్సవ్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం ఈ మహిళా ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా ఉత్సవ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉత్సవ్‌లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న మహిళలు మొగల్రాజపురంలో రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

గుణదల పుణ్యక్షేత్రానికి ఉత్సవ శోభ





క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రమైన గుణదల మేరీమాత పుణ్య క్షేత్రం ఉత్సవ శోభను సంతరించుకుంది. బుధవారం మరియమాత జెండాను ఆవిష్కరించి నవదిన ప్రార్థనలకు శ్రీకారం చుట్టారు. భక్తుల సమక్షంలో విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు మేరీమాత పతాకాన్ని ఆవిష్కరించారు.

–గుణదల (విజయవాడ తూర్పు)



